# ట్రంప్, కిమ్ భేటీ మంచిపరిణామం - పొంచివున్న ప్రమాదాలు

**ఈ** ఏడాది జూన్ 12న అమెరికా, కొరియా అధ్యక్షులు ట్రంప్, కిమ్ భేటీ అయి ఓ సంయుక్త ప్రకటన చేశారు. అనేక ఒడిదుడుకులు, అనిశ్చితి మధ్య ఈ సమావేశం జరిగింది. అసలీ సమావేశం జరుగుతుందా లేదా పరిణామాలెలా ఉంటాయి అన్న ఉత్కంఠ ప్రపంచం అంతా ఉండింది.

ఈ భేటీ ఫలప్రదం, చారిత్రాత్మకం అని ఉత్తరకొరియా ప్రభుత్వ ప్రసార మాధ్యమాలు అభివర్ణించాయి. గతాన్ని మర్చిపోయి ముందుకు సాగుతామని ట్రంప్, కిమ్ ప్రకటించారు. ప్రపంచంలో కొత్త పరిణామాలు చోటుచేసుకుంటాయన్నారు.

ఈ భేటీ జరగక ముందు కిమ్‌ను ట్రంప్ నానావిధాలుగా దూషించడం, బెదిరించడం మనందరికీ తెలుసు. కిమ్ తనకి, తన దేశానికి ఆత్మహత్యా సదృశమైన మార్గాన్ని ఎంచుకున్నాడని విమర్శించాడు. తీరా భేటీ అనంతరం కిమ్ చాలా తెలివైనవాడని, మంచి సంధానకర్తని, తన దేశాన్ని, ప్రజల్ని ప్రేమిస్తున్నాడని పొగిడాడు. ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరచి శాశ్వతమైన, స్థిరమైన రాజ్యాన్ని కొరియా ద్వీపకల్పంలో స్థాపించాలని, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధించాలని అంగీకారం కుదిరినట్లు ఉమ్మడి ప్రకటనలో తెలిపారు. కొరియా యుద్ధఖైదీల మార్పిడి, ఆచూకీలేని సైనికుల కోసం అన్వేషించాలని, ఒప్పందంలోని అన్ని అంశాలు అమలయ్యేలా చూడాలని ఉభయ నేతలు తెలిపారు. అదేవిధంగా ఉత్తరకొరియా భద్రతకు ట్రంప్ హామీ ఇచ్చాడు. అమెరికా – దక్షిణ కొరియా మిలటరీ విన్యాసాలను ఆపేసినట్లు, 28 వేల 500 మంది అమెరికా సైనికుల్ని దక్షిణ కొరియా నుంచి ఉపసంహరించుకొంటున్నట్లు ట్రంప్ ప్రకటించాడు. యుద్ధం, అణ్వాయుధాల ముప్పు నుండి అమెరికా, జపాన్, కొరియా ప్రజలు బయటపడటమే ముఖ్యమని దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ అన్నాడు. ట్రంప్, కిమ్‌ల భేటీని, ఒప్పందాన్ని ఆహ్వానించదగిన పరిణామం అని మూన్ అన్నాడు. సమాన హోదాలో అధ్యక్షుల మధ్య చర్చలు జరగలేదని పశ్చిమ దేశాల ప్రసార మాధ్యమాలు భావిస్తున్నాయి. ఓ బలహీనమైన దేశపు ధిక్కారాన్ని దారిలోకి తెచ్చేందుకు శక్తివంతమైన దేశం చేసిన ప్రయత్నంగానే దీన్ని పరిగణిస్తున్నాయి. పశ్చిమ దేశాల ప్రజలకు ఉత్తరకొరియాని ఓ భూతంలాగా చూపిస్తున్నారు. అణ్వాయుధాలని తయారుచేసి అమెరికాకు సవాలుగా నిలుస్తుందంటున్నారు. కాని కొరియా ద్వీపకల్పంలో జోక్యం చేసుకొని ఆయుధ సంపత్తితో యుద్ధ భయాలను అమెరికా కలిగిస్తున్నదని వారు మరిచిపోతున్నారు. ఈ ప్రాంతంలో శాంతిభద్రత, స్థిరత్వాలకు భంగం కలిగిస్తోందని గ్రహించటంలేదు. ఉత్తరకొరియా ఆయుధాల తయారీ కేవలం స్వీయరక్షణకేనన్న నిజం కానరావటంలేదు.

శిఖరాగ్ర సమావేశం కాగానే అదే ప్రజలు కాకమ్మ కథలు ప్రచారం చేస్తున్నారు. ఆర్థిక ఆంక్షలు, కఠిన వైఖరి, యుద్ధభయం, ఉత్తర కొరియాను ఏకాకి చేయటం వంటి చర్యలవల్లే చర్చలు జరిగాయని ఊదరగొడుతున్నారు. కాని ఇవి సామ్రాజ్యవాదులను తృప్తిపరచటానికి తప్ప ఏ ప్రయోజనాన్ని సాధించలేవు. అమెరికాతో ఏవిధంగాను ఉత్తరకొరియా సమ ఉజ్జీ కాదు. కొరియా ద్వీపకల్పంలో సమస్యలన్నీ సామ్రాజ్యవాదుల జోక్యం వల్లే అని ఉత్తరకొరియాకు తెలుసు. ఉత్తర, దక్షిణ కొరియా మధ్య సమస్యలు పరిష్కరించి శాంతి, సుస్థిరత స్థాపించాలన్నదే ఉత్తర కొరియా నాయకత్వం కోరుతోంది. కాని సామ్రాజ్యవాదుల జోక్యం నివారించటంవలనే ఇది సాధ్యమని తెలుసు. దీనికై ఉత్తర కొరియా రెండు ప్రత్యామ్నాయాలను ఎన్నుకొంది. అమెరికా కయ్యానికి కాలు దువ్వినా తమ ప్రజలను సంసిద్ధులుగా ఉంచడంవల్ల యుద్ధాన్ని నివారించవచ్చు. రెండోది చర్చలకు అనుకూల వాతావరణం ఏర్పడేలాగా శాంతి రాయబారం పంపడం. ఈ రెండు మార్గాల ద్వారా లక్ష్యాన్ని నెరవేర్చవచ్చని కిమ్ భావిస్తున్నాడు. ప్రపంచ సామ్రాజ్యవాద దేశాల్లో అమెరికా బలమైన శక్తి. అదెప్పుడంటే అప్పుడు యుద్ధంతో వినాశనం సృష్టించగలదు. దౌత్యపరమైన చర్చలు, యుద్ధం, ఆర్థిక ఆంక్షలతో దాని లక్ష్యాలను సాధిస్తుంది. యుద్ధం అన్నివేళలా అనుకున్న లక్ష్యాన్ని సాధించలేదని తెలుసు. ఏ పద్ధతిని అమెరికా ఉపయోగిస్తుందనేది ఆయా కాలమానాలను బట్టి, తమ దేశ – శత్రుదేశ పరిస్థితులను బేరీజు వేసుకొని నిర్ణయం జరుగుతుంది.

ఉత్తరకొరియా నాయకత్వం అంత తేలికగా లొంగేది కాదని తెలుసు. యుద్ధంపై అమెరికా ముందు వెనుక ఆలోచించే పరిస్థితిని ఉత్తర కొరియా కలిగించింది. దక్షిణ కొరియా ప్రజలు యుద్ధానికి వ్యతిరేకులు; ముఖ్యంగా ఉత్తరకొరియాతో. దక్షిణ కొరియాలో ఒలింపిక్ క్రీడల సందర్భంగా ఉత్తరకొరియా బృందాలకు ఆ దేశం భారీ స్వాగతం పలికిన విషయం దీనికి నిదర్శనం. అమెరికా చేసే ఏ దుస్సాహసానికైనా రష్యా, చైనా విముఖంగా ఉన్నాయి. పైగా అమెరికా ఆర్థికవ్యవస్థ సంక్షోభంలో ఉంది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ తదితర దేశాలపై దాడులు, అమెరికాలో అంతర్గతంగా యుద్ధ వ్యతిరేక వైఖరి, అమెరికా వైఖరిపై ప్రపంచ దేశాల హెచ్చరికల వంటివి దానిని వెనక్కు తగ్గేలా చేశాయి. ఈ పరిస్థితులన్నీ ట్రంప్ – కిమ్ చర్చలకు దారితీశాయి. ఈ చర్చలు అత్యవసరమని తద్వారా తన దేశ ఆర్థికవ్యవస్థను పటిష్టపరిచి ప్రజల అవసరాలు తీర్చవచ్చని కిమ్ ఆలోచన. యుద్ధోన్మాది అయిన అమెరికా కూడా ఈ పంథానే ఎన్నుకుని చర్చల మార్గం పట్టింది. జూన్ 12న శిఖరాగ్ర సమావేశంలో జరిగిన ఒప్పందాలు సుదీర్ఘ శాంతి ప్రస్థానంలో కేవలం చిన్న అడుగులు మాత్రమే. కొరియా విషయంలో అనేక సమస్యలున్నాయి; ఆచరణీయ పంథాలో వీటికి పరిష్కారం కనుగొనాలి.

– సామ్రాజ్యవాదశక్తులు దండయాత్ర చేసి కొరియాను బలవంతంగా 1953లో విడగొట్టారు. అప్పటినుంచి ఉత్తర, దక్షిణ కొరియాలు కత్తులు దూసుకుంటూనే ఉన్నాయి. ఈ యుద్ధ వాతావరణానికి చరమగీతం పాడి శాంతి స్థాపించాలి. ఈ దిశగా ట్రంప్ – కిమ్ భేటీ ఎలాంటి ప్రయత్నం చేయలేదు.

– 28 వేల 500 మంది అమెరికా సైనికులు దశాబ్దాలుగా దక్షిణ కొరియాలో తిష్టవేశారు. అది ఓ వలసగా మారిపోయింది. ఇది ఉత్తర కొరియాకు పొంచి ఉన్న ప్రమాదమే. ప్రస్తుతం ట్రంప్ దళాలను ఉపసంహరిస్తా మన్నాడు. ఖచ్చితంగా అమలుచేయాలి.

– కొరియా ద్వీపకల్పాన్ని పూర్తిగా అణస్త్ర రహితంగా చేయడం లక్ష్యమని కిమ్ అంగీకరించాడు. ఉత్తరకొరియాకు భద్రత కల్పిస్తానని అమెరికా కూడా ఒప్పుకుంది. ఇది జూన్ 12న కుదిరిన అంగీకారమైనా అది ఎన్నో వివాదాలకు మూల మయింది. దీన్ని దశలవారీగా అమలుచేయాలని, అదే సమయంలో అణ్వస్త్ర నిషేధాన్ని అమలుచేయాలని ట్రంప్, కిమ్ గుర్తించినట్లు ఉత్తరకొరియా అధికార మీడియా పేర్కొంది. కాని ఇది ఉభయుల వ్యవహారం. అమెరికా కూడా చిత్తశుద్ధితో ఉండాలి. అయితే ఇది ఉత్తరకొరియా పని అని అమెరికా అంటోంది. అణ్వస్త్ర నిషేదం దిశగా ఉత్తరకొరియా చర్యలేమీ చేపట్టటంలేదని అమెరికా ఇప్పటికే ప్రచారం ప్రారంభించింది.

– ఉత్తరకొరియాకు భద్రత కల్పిస్తామని అమెరికా చెప్పినా కిమ్‌కు నమ్మకంలేదు. అమెరికాను నమ్మి నిరాయుధీకరణ చేస్తే ఆత్మహత్య సదృశ్యమేనని కిమ్ భావన. దీనిపై ఏం చేయాలనేది కిమ్ నిర్ణయించుకోవాలి.

– ఉత్తరకొరియాపై ఆర్థిక ఆంక్షలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. పూర్తిగా నిరాయిధీకరణ జరిగినపుడే ఆర్థిక ఆంక్షలు ఎత్తేస్తామని అమెరికా రక్షణశాఖా మంత్రి అంటున్నారు.

ఈ సమస్యలన్నీ ఇలా ఉండగానే జూన్ 23న ట్రంప్ ప్రకటన చేస్తూ ఉత్తరకొరియా విధానాలు అమెరికా భద్రతకు, విదేశీ విధానాలకు ప్రమాదంగానే ఉన్నాయన్నాడు. దీంతో కొరియా ద్వీపకల్పంలో శాంతిమార్గం అంత సుగుమమైనది కాదని, అనేక ప్రమాదాలు పొంచివున్నాయని తెలుస్తోంది. అమెరికా సామ్రాజ్యవాదులు దేశాలను తమదారిలోకి తెచ్చుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తూనే ఉంటారు. పీడిత దేశాల ప్రజలు సామ్రాజ్యవాదుల చర్యలపట్ల అప్రమత్తంగా వుంటూ తమ ప్రయోజనాలను పరిరక్షించుకోవాల్సి ఉంది. సామ్రాజ్యవాదులకు ఇక ముందు గడ్డుకాలమేనని రానున్నకాలం నిరూపిస్తుంది.

oooo